# ఒక్కటే ఇచ్ఛ.. ఒక్కటైతేనే స్వచ్ఛ!

● స్వచ్ఛభారత్ సాధన దిశగా అనంత

● 'ఈనాడు' చైతన్య క్రతువుతో సత్ఫలితాలు

"స్వచ్ఛత దిశగా ముందడుగు.. శుభ్రత పరిఢవిల్లిన చోటే భగవంతుడు కొలువై ఉంటాడని పేర్కొన్న పూజ్య బాపూజీ ఆశయ సాధనకు పట్టణాలు మొదలు పల్లెలు కదం తొక్కుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ముమ్మరంగా సాగుతున్న మరుగుదొడ్ల నిర్మాణం, వాటి వినియోగం, వీధుల శుభ్రతే ఇందుకు నిదర్శనం. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపును అందిపుచ్చుకుని స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర సాకారానికి చక్కటి ప్రణాళికతో సాగుతున్నారు. ప్రతిష్ఠాత్మక స్వచ్ఛ యజ్ఞానికి నేను సైతం అంటూ 'ఈనాడు' చేపట్టిన స్వచ్ఛ ఉద్యమంలో భాగస్వాములైన అన్ని వర్గాలు ఆ నిత్య స్ఫూర్తి.. స్వచ్ఛ దీప్తిని హృది నిండా నింపుకొని నవ చైతన్యంతో సాగుతున్నారు. స్వచ్ఛోదయ సాకారానికి ప్రతి ఒక్కరు ఒక స్వచ్ఛాగ్రహియై అహరహం శ్రమిస్తున్నారు. 'ఈనాడు' చైతన్య క్రతువులు, ప్రభుత్వ స్వచ్ఛ కార్యక్రమాల సమాహారంతో స్వచ్ఛతను చాటుతున్న విద్యాలయాలు.. కార్యాలయాల కృషిని తరచి చూద్దాం. ఇదే స్వచ్ఛ ఆశయం దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలి... ఇకనైనా మారాలి.. స్వచ్ఛభారతాన్ని ఆవిష్కరించాలి.

## శుభ్రత దిశగా అడుగులు!

**పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే:** స్థానిక ఆర్టీసీ బస్టాండు మొదలు డిపో ఆవరణ, ప్రాంగణం వరకు చూద్దామంటే కాగితం ముక్క కానరాదు. పచ్చనిచెట్లు, పరిశుభ్రత గోచరిస్తుంది. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో గోకులం ద్వారా బజారు సమీపంలో వెలసిన కాలనీ పరిశుభ్రంగా మారింది. అద్దంలా ఉండే పచ్చని చెట్లు కలిగిన రహదారి ఆహ్లాదాన్ని పంచుతోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎప్పటికప్పుడు పెరుగుతున్న పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రతను చాటుతున్నారు. ఇలా చాలామంది స్వచ్ఛతను చాటుతున్నారు. ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు స్వచ్ఛత పాటించడంలో మొద్దు నిద్ర వీడటం లేదు. స్థానిక విద్యుత్తు శాఖ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందుకు నిదర్శనం.



ముచ్చటగా ఆర్టీసీ ప్రాంగణం

## మార్పు అనంత నుంచే మొదలు

**అనంత నగరపాలిక, న్యూస్‌టుడే:** స్వచ్ఛభారత్ అడుగులు అనంతలో పుష్కలంగా దర్శనమిస్తున్నాయి. మొక్కలు నాటడం, రహదారులు శుభ్రంగా ఉంచడం తదితర పనులు చేపట్టారు. ప్రధానంగా ఐదో డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పచ్చదనం పరుచుకుంది. ఆర్టీవో కార్యాలయం సమీపంలో నిత్యం చెత్త నిండిపోయేది. ప్రస్తుతం అక్కడ ఉద్యానం వెలసింది. అలాగే ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీనివాసనగర్ వైపు ఆటోస్టాండ్ వద్ద అపరిశుభ్రంగా ఉండేది. అక్కడ కూడా పచ్చిక ఏర్పాటు చేశారు. రహదారికి ఇరువైపులా మొక్కలు పెంచుతున్నారు. స్థానిక బ్యాంకు ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ మధ్య ఉన్న రహదారి స్థానికులకే కాకుండా, ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతోంది.



శ్రీనివాస నగర్‌లో ప్రస్తుతం ఇలా.. ( ఏపుగా పెరిగిన మొక్కలు)

## స్వచ్ఛతకు మారుపేరు!

**ధర్మవరం పట్టణం:** ధర్మవరం సామాజిక ఆసుపత్రి ముందు భాగం, గేట్ వద్ద 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ - స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో భాగంగా చెత్త చెదారాన్ని పూర్తిగా తొలగించేశారు. ఇప్పుడు ఈ పరిసరాలు పచ్చని పచ్చికతో కళకళలాడుతుంది. గతంలో ఆసుపత్రికి వచ్చిన రోగులు వైద్యశాల ముందు ఖాళీ స్థలంలో తిన్న వ్యర్థాలను, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ కవర్లు వేసేవారు. మరోవైపు ఆసుపత్రి ప్రధాన గేట్ వద్ద వాణిజ్య సముదాయ ప్రైవేట్ కాంప్లెక్స్ నిర్మాణం ఉంది. దుకాణాలపై నుంచి చెత్త, వ్యర్థాలను ఖాళీ స్థలంలో వేయడంతో అధ్వానంగా ఉండేది. ఈతరుణంలో అధికారులు, పాలకులు స్పందించి స్వచ్ఛ భారత్‌లో భాగంగా వ్యర్థాలను, చెత్త తొలగించేశారు. పచ్చని పచ్చిక తెప్పించి, అందులో మొక్కలు నాటారు. దీంతో నేడు పచ్చని మొక్కలతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నింపుతున్నారు.



ఆసుపత్రి ఆవరణలో పచ్చికతోపాటు పచ్చని మొక్కలు

## ఆహ్లాదానికి నెలవు

**కదిరి, న్యూస్‌టుడే:** స్వచ్ఛభారత్ కార్యక్రమంతో నిజాంవలి కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణ ఆహ్లాదకరంగా మారింది. గతంలో ప్రాంగణం చెత్తదిబ్బలతో నిండి దుర్వాసన వెదజల్లేది. 'ఈనాడు' ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంతో పరిశుభ్రంగా తయారైంది. మైదానంలో 'ఈనాడు', పాఠశాల సిబ్బంది మొక్కలు నాటారు. పరిశుభ్రంగా మారిన పాఠశాలలో స్థానికులు చెత్తవేయటం మానారు. విద్యార్థులు శుభ్రతతోపాటు మొక్కల సంరక్షణలో భాగస్వాములయ్యారు. చెత్తాచెదారానికి తావు లేకుండా చేసి పూలు, కూరగాయల మొక్కలు పెంచుతున్నారు. వెరసి పాఠశాల పచ్చదనంతో కళకళలాడుతోంది. ఆహ్లాదంతో కూడిన ప్రశాంత వాతావరణంతో ప్రాంగణం ముచ్చట గొలిపేలా అలరిస్తోంది.



పరిశుభ్రత, పచ్చదనంతో పాఠశాల ఆవరణ



స్వచ్ఛతకు మారు పేరులా బడి..

## అపరిశుభ్రత వీడి పురస్కారం కైవసం!



మొక్కలకు రక్షణగా ఇనుప కంచె

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** స్థానిక శ్రీబాలగంగాధర తిలక్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాఠశాల పరిసరాలను స్వచ్ఛతకు మారుపేరుగా తీర్చిదిద్దారు. రెండేళ్ల కిందట బడి ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ చెత్త, అపరిశుభ్రతతో మురికి కూపంలా ఉండేది. 'ఈనాడు' ఆధ్వర్యంలో 2014 నవంబర్‌లో 11న పాఠశాలలో స్వచ్ఛభారత్ నిర్వహించగా విద్యార్థుల్లో చైతన్యం వచ్చింది. అప్పటి నుంచి ప్రతిరోజూ శుభ్రత కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయి. ప్రతి తరగతి నుంచి ఐదుగురు విద్యార్థినులతో ఒక కమిటీని వేశారు. వీరు ఆసాంతం పర్యవేక్షించి శుభ్రతకు మెరుగుపరుస్తారు. ప్రతి శనివారం అన్నితరగతుల విద్యార్థులు పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొంటున్నారు. గతంలో నిర్వహణ లేక మూలన పడిన మరుగుదొడ్లు నేడు శుభ్రంగా ఉంటూ వాడుకలోకి వచ్చాయి. ఎప్పటికప్పుడు పాఠశాల ఆవరణలో సున్నం, బ్లీచింగ్ చల్లుతూ దోమల నివారణకు కృషి చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో ఇనుప కంచెను ఏర్పాటు చేసి రక్షిస్తున్నారు. పాఠశాల శుభ్రతను గుర్తించిన మున్సిపల్ అధికారులు ఉత్తమ స్వచ్ఛత అవార్డును ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణకు అందజేశారు.



పాఠశాల వెనక బ్లీచింగ్ చల్లి శుభ్రంగా ఉంచిన వైనం